# మనవే'మన పద్యములు

**ఆ.వె.** అల్పబుద్ధి వాని కధికారమిచ్చిన
దొడ్డవారి నెల్ల దొలగ జేయు
జెప్పు దినెడి కుక్క చెఱకు తీపెఱుగునా
విశ్వదాభిరామ వినురవేమ!

**తాత్పర్యము** : అల్పునకు అధికారము ఇచ్చినచో, గొప్పవారినందరినీ తొలగించివేయును. వారి గొప్పదనమును గాని, వారివల్ల జరుగు మంచినిగాని గుర్తింపలేడు. చెప్పులు కొఱికెడు స్వభావము ఉన్న కుక్కకు చెఱకు రసములోని మాధుర్యము ఎలా తెలుస్తుంది?

**ఆ.వె.** ఆశచేత మనుజు లాయువుగలనాళ్ళు
తిరుగుచుందురు భ్రమ తిప్పలేక
మురికి భాండమందు ముసురునీగల భంగి
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థములు** :

ఆశ = ఉన్నదానితో మనని ఉండనివ్వకుండా చేసేది.
ఆయువు = జీవితకాలము
భ్రమ = లేనిది ఉన్నట్లు అనిపించేది.
భాండము = కుండ.
భంగి = విధము.

**తాత్పర్యము** : మనుషులు జీవించి ఉన్నంత కాలము ఉన్నదానితో తృప్తి చెందక, ఇది కావాలి ... అది కావాలి అని ఏదో పొందాలనే భ్రమలో కొట్టుకుంటూ గడిపేస్తారు. మురికిగా ఉన్న గిన్నె చుట్టూ ఈగలు ముసిరినట్లు, పరిశుద్ధముగా లేని (మలినమైన) మనసుతో కూడిన ఈ శరీరమనే భాండము చుట్టూ కోరికలనే ఈగలు ముసురు కుంటాయని దీని భావము.

కావున దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని అన్నట్లు, జీవించి ఉన్నంత కాలము పరుల మేలుకొరకు పనిచేస్తూ, ఉన్నదానితో తృప్తి చెందుతూ ఆలోచనలను పరిశుద్ధముగా ఉంచుకోడానికి ప్రయత్నించడం అవసరం.